28-9Pg4 :Layout 1 9/28/22 12:34 AM Page 1

వార్త

మనిషి ఆకలితో ఉన్నప్పుడు అభిమానం, కులం, విద్య, జ్ఞానం, హోదా, అనురాగం అన్నీ మర్చిపోతాడు.

-అవ్వైయార్

సంక్షోభంలో కాంగ్రెస్ !

కాలం ఎవరికీ ఒకే విధంగా ఉండదు. కాలం కలిసివచ్చినప్పుడు పరిస్థితులు వాటంతట అవే ఎలా తోసుకువస్తాయో కలిసి రానప్పుడు ఒక్కొక్కటి వికటిస్తుంటాయి. కలిసి వచ్చినప్పుడు అంతా తమ గొప్పగా అన్నట్లు ఆనందోత్సవాలతో విర్రవీగడం, కలిసిరానప్పుడు పరనిందలు, నిర్వేదంతో మునిగితేలడం మానవనైజం. కానీ ఈ జయాపజయాలకు మూలకారణం మానవ ప్రయత్నం అనేది కాదనలేని వాస్తవం. కాలం కలిసిరానప్పుడు అన్ని తప్పటడుగులే పడుతాయనేది వేదాంతుల వాదన. ఏదిఏమైనా కలిసివచ్చిన కాలంలో అవకాశాలు ఉపయోగించుకొని గర్వంతో విర్రవీగకుండా మంచి కార్యక్రమాలతో సేవలు అందించిన పార్టీలకు, పార్టీ నేతలకు చిరకాలం ప్రజల హృదయాల్లో చోటు దక్కుతుంది. అదే గర్వంతో కన్నుమిన్నుకానక ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరించి ప్రజల సొమ్మును ఇష్టానుసారంగా భోంచేసి లక్ష్మీపుత్రులైతే అప్పటికప్పుడు తాత్కాలికంగా ఆ ప్రభావం చూపకపోయినా ఆ తర్వాత వాటి పరిణామాలు, ప్రభావాలు ఆ నేతలపై, ఆ పార్టీలపై పడకతప్పదు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అందుకు అద్దంపడుతున్నదేమోననిపిస్తున్నది. ఒకనాడు భారతదేశంలో ఎదురులేకుండా వెలిగిన కాంగ్రెస్ పార్టీ పరిస్థితి రానురాను దిగజారిపోతున్నది. అవమానకరంగా పరాజయాల తర్వాత అందుకు కారణాలు, కారకుల గురించి లోతుగా అధ్యయనం చేసి ఆత్మపరిశీలన చేసుకొని క్షేత్రస్థాయిలోని వాస్తవాలను తెప్పించుకొని ఓటమిలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకొని భవిష్యత్ విజయానికి ఆ పరాజయాన్ని ఒక మెట్టుగా ఉపయోగించుకోవడం విజ్ఞుల లక్షణం. ఎందుకోఏమోకానీ కాంగ్రెస్ పార్టీలో అవి జరగడం లేదు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడంలో హస్తిన పెద్దలు విఫలమవుతున్నారని చెప్పకతప్పదు. ఇందుకు చుట్టూ ఉన్న భజనపరులనే విమర్శలను కొట్టివేయలేం. ఏదిఏమైనా జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఇప్పుడు తాజాగా రాజస్థాన్‌లో జరుగుతున్న సంఘటనలు ఇందుకు అద్దంపడుతున్నాయి. దీనికి కారణం కాంగ్రెస్ అధిష్టానం చేసుకున్న స్వయంకృతాపరాధమేననే రాజకీయ పరిశీలకుల అభిప్రాయాన్ని కొట్టివేయలేం. వాస్తవంగా చూస్తే గత సాధారణ ఎన్నికల్లో పార్టీని రాజస్థాన్‌లో విజయపథంలో నడపడంలో యువనేత సచిన్‌పైలెట్ కీలకపాత్రే వహించారు. అప్పట్లో ఆయననే సిఎంగా చేయాలని రాహుల్‌గాంధీ కొంతమేరకు ప్రయత్నించారు. కానీ పైలెట్‌కు పాలనానుభవం లేదని అశోక్ గెహ్లోత్‌ను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టారు. అప్పటి నుంచి ఇక్కడ అంతర్గతంగా విభేదాలు పొడచూపుతూనే ఉన్నాయి. 2020లో పైలెట్ తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ప్రభుత్వం పతనం అంచునకు చేరుకుంటుందన్న దశలో రాహుల్‌తోపాటు ప్రియాంకగాంధీ రంగప్రవేశం చేసి పైలెట్‌ను సముదాయించారు. కానీ వారిమధ్య విభేదాలను మాత్రం పరిష్కరించలేకపోయారు. ఇప్పుడు కాంగ్రెస్ అధ్యక్షపదవికి ఎన్నికల్లో పోటీ చేసేందుకు గెహ్లోత్ ఉత్సాహం చూపడం, ఈ తరుణంలో పైలెట్‌కే ముఖ్యమంత్రి పదవి దక్కే అవకాశాలుంటాయని ఊహించారు. గెహ్లోత్ అటు ముఖ్యమంత్రి పదవి, ఇటు అధ్యక్ష పదవిలో రెండింటిలోనూ తానే ఉండాలని పావులు కదిపారు. అయితే ఒక వ్యక్తికి ఒక్కటే పదవి అనే సిద్ధాంతం కింద ఆయన వ్యూహాన్ని కాంగ్రెస్ పెద్దలు అడ్డుకున్నారు. దీంతో ఏకంగా ఆయన తనకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేలతో అధిష్టానానికి ధిక్కార స్వరం వినిపించారు. పరిస్థితి చేయిదాటుతున్న తరుణంలో కాంగ్రెస్ అధిష్టానం కళ్లుతెరిచి సీనియర్ నేతలను రంగంలోకి దింపింది. తమకు అత్యంత విశ్వాస పాత్రుడిగా ఉన్న గెహ్లోత్ ఈ స్థాయిలో తమను ధిక్కరిస్తారని అధిష్టానం ఊహించలేకపోయింది. దీంతో గెహ్లోత్ ఎఐసిసి అధ్యక్ష పదవికి పోటీ చేసే విషయం ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ పోటీ చేసినా ఆయన గెలుపు అంతసులభం కాకపోవచ్చు. ఇక్కడే కాదు అధికారంలో లేని రాష్ట్రాల్లో కూడా కాంగ్రెస్ గ్రూపులు, ముఠాలు, వర్గాల అంతర్గత పోరుతో కుదేలైపోతున్నది. ఇప్పటికే అధిష్టానవర్గం తీసుకుంటున్న నిర్ణయాలు,కొందరు నేతలు వ్యవహరిస్తున్న తీరుతో ఆంధ్రప్రదేశ్‌తోసహా అనేకరాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోయింది. సీనియర్ నేతలు పార్టీని వదిలివెళ్లిపోతున్నారు. మొన్న పార్టీని వదిలివెళ్లిన సీనియర్ నేత గులాంనబీ ఆజాద్ కశ్మీర్‌లో సోమవారం కొత్త పార్టీ ప్రకటించారు. ఆ పార్టీ అక్కడ విజయం సాధిస్తుందో లేదో చెప్పలేం కానీ కాంగ్రెస్ ఓట్లు చీలి భారీ నష్టమే చేకూరుతుంది. కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికీ అంతోఇంతో ఓటు బ్యాంకు ఉన్నదనే విషయంలో అనుమానం లేదు. కాబట్టే ఆ మాత్రం అయినా ఓట్లు వస్తున్నాయి. అందుకు నేటి నాయకులు కారణం కాదు. దేశంలో కాంగ్రెస్‌పార్టీ నేటికీ సజీవంగా బతికి ఉన్నదంటే ఆనాడు స్వాతంత్ర్యసమరంలో పెద్దలు చేసిన త్యాగమే. ఆ తర్వాత ఇందిరాగాంధీ పేదప్రజల సంక్షేమానికి, అభ్యున్నతి కోసం చేపట్టిన సంస్కరణలు కాంగ్రెస్‌కు కొన్ని వర్గాల మనస్సుల్లో స్థానం సంపాదించి పెట్టాయి. కానీ ఇటీవల జరుగుతున్న సంఘటనలు, అధిష్టానం వ్యవహరిస్తున్న తీరుతో నేడు ఆ వర్గాలు కూడా క్రమేపీ దూరమైపోతున్నాయి. ఇప్పటికైనా అధిష్టానం వాస్తవ పరిస్థితులను గ్రహించాలి. పనిచేసే కార్యకర్తలకు, ప్రజాభిమానం, ప్రజావిశ్వాసం ఉన్న నేతలకు కీలకబాధ్యతలు అప్పగించాలి.ప్రజావిశ్వాసం అనేది చాలా సున్నితమైనది. అదే సమయంలో చంచెలమైనది.ఒకసారి అవి సన్నగిల్లితే కాంగ్రెస్‌ను గట్టెక్కించడం ఎవరి తరంకాదు. ఈ వాస్తవాన్ని అధిష్టానం ఎంత తొందరగాగ్రహిస్తే అంత మేలు.

కోపాన్ని జయించలేనివాడికి ఇతరుల సామర్థ్య లోపాన్ని విమర్శించే హక్కు ఉండదు.

ఇ. గిబ్బన్

దిగజారడం ప్రారంభించనేకూడదు. ఒక్కసారి దిగజారితే ఇక దానికంతే ఉండదు.

హెచ్.లాంగ్‌ఫెలో

ప్రజావాక్కు

రైతుల యాత్రపై దుష్ప్రచారం తగదు

రాజధాని రైతుల పాదయాత్రతో ఉద్రిక్తతలు పెరిగిపోతాయని చెపుతూనే కొందరు మంత్రులు రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడుతున్నారు. ఇదీ ఒక ఓదార్పు యాత్ర వలె భావిస్తే నష్టమేమి ఉంది? ఈయాత్ర పిమ్మట వాళ్లు మరో యాత్ర చేయవచ్చు. ప్రభుత్వం తలచుకుంటే డబ్బుకు కొదవేముంటుంది? మూడు రాజధానులతో నష్టంఉన్నదని మరోమంత్రి అంటారు. ప్రస్తుత రాజధానిలో మూడుప్రభుత్వవిభాగాల నిర్మాణాలుజరిగి పాలన సజావుగా సాగిపోతుంటే మళ్లీ ఇప్పుడు మూడు రాజధానుల పేరుతో మిగతా ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు, ఉద్యోగుల నివాసాల ఏర్పాటు,ప్రజాప్రతినిధుల,అధికారుల తరచురాకపోకలకు కోట్లాది రూపాయల అదనపు భారాలు మోసేది పన్నులు కట్టే సామాన్య ప్రజానీకమే. అందుకే టిడిపి మాత్రమేగాక అన్ని ప్రతిపక్ష పార్టీలు,కోర్టులు,కేంద్రం కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఏపార్టీ అధికారంలోకి వచ్చినా అవకతవకలు జరుగుతూనే ఉన్నాయి.వాటినినియంత్రిస్తే ప్రజలూ హర్షిస్తారు.కనుక ఇకనైనా అన్ని పార్టీ నేతలు వ్యక్తిగత విమర్శలకు పాల్పడకుండాప్రజాసమస్యలపైదృష్టిసారిస్తేనేరాష్ట్రం బాగుపడుతుంది.

-తిరుమలశెట్టి సాంబశివరావు, నర్సరావుపేట

మంత్రులకు తగని మాటలు

పాదయాత్రను ఆపాలంటే అయిదు నిమిషాల పని అంటూ సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ చేస్తున్న వ్యాఖ్యలు మంత్రుల స్థాయికి తగినవి కావు. వాస్తవానికి అసలు యాత్రకే అనుమతి ఇవ్వలేదు ప్రభుత్వం. న్యాయస్థానంలో పోరాడితేనే రైతులకు ఆ ప్రజాస్వామ్య హక్కు దక్కింది. అందుకు పాలకులు సిగ్గుపడాలి. బస్సుయాత్ర చేసి అభాసుపాలైంది అమాత్యులుమరిచిపోతేఎలా?మూడు రాజధానులు కావాలని అటు విజయనగరంనుంచి తాడేపల్లికి మంత్రిగారుకూడా పాదయాత్ర చేసుకోవచ్చుకదా?ఈమాత్రం దానికి వ్యర్థప్రేలాపన ఎందుకు?

-కంభంపాటి కోటేశ్వరరావు, విశాఖపట్నం

భవిష్యత్ సోలార్ పవర్‌దే

ప్రపంచంలో విద్యుత్ వినియోగం సోలార్ విండ్ పవర్‌తోనే సాధ్యమవుతుంది. ప్రస్తుతం బొగ్గు, నీరు, అణుశక్తితో విద్యుత్ ఉత్పత్తి భారంగా మారుతుంది. ఈ ఇంధనాల వాడకం వల్ల ఖర్చు అధికం కావడమే కాకుండా కాలుష్యం జరుగుతుంది. అదే సోలార్ పవర్, విండ్ పవర్ వల్ల పర్యావరణంలో ఏ మార్పు ఉండదు. కావున భవిష్యత్ విద్యుత్ ఉత్పత్తి సోలార్, విండ్ పవర్‌తోనే సాధ్యం అవుతుంది. అలాగే వీటిని మనకు అవసరమైన చోట సులభంగా అమర్చుకోవచ్చు.

-డి.చాంద్‌బాషా, కర్నూలు

ప్రజాప్రతినిధులకు బాధ్యత లేదా?

రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో లోపాలకు, వైఫల్యాలకు మంత్రులు, ప్రజాప్రతినిధులు అధికారులపై మండిపడుతున్నారు. తాజాగా మాజీహోంమంత్రి సుచరిత సీజన్ ప్రారంభానికి ముందే కాలువల్లో పూడిక ఎందుకు తీయలేదని అధికారులను నిందిస్తున్నారు.వాస్తవానికి సీజన్‌కు ముందే దినపత్రికల్లో తీసుకోవల్సిన చర్యలపై ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ వార్తలు ప్రచురించారు. అప్పుడు పెడచెవిన పెట్టి ఇప్పుడు అధికారులపై చిందులేయడం సబబుకాదు.బకాయిలు చెల్లించకుండా, నిధులు ఇవ్వకుండాఅధికారులపై నిందవేయడం తగదు.పత్రికల్లో వాస్తవాలు ప్రచురిస్తుంటే లోపాలను సరిదిద్దు కోకుండా వారికి పచ్చ మీడియా అనిఎదురుదాడి చేయడం పాలకులకు నిత్యకృత్యమైంది.

- జి.రామకృష్ణ, ఏలూరు, ఏలూరుజిల్లా

బానిసలు కావొద్దు

టెక్నాలజీ అభివృద్ధి చెందడంతో నేడు అందరి చేతులలో స్మార్ట్ ఫోనులు దర్శనమిస్తున్నాయి.అరచేతిలోనే ప్రపంచాన్ని చూడగలుగుతున్నారు.కొందరు జ్ఞానసముపార్జనకు,సమాచారం కోసం ఈస్మార్ట్‌ఫోనులు ఉపయోగిస్తుంటే మరికొందరు అశ్లీల దృశ్యాల వీక్షణకు,ఫోనులో ఆటలతో, గంటల తరబడి గడిపేస్తున్నారు. ఇంకొందరు అర్ధరాత్రి వరకు చాటింగ్‌లు చేస్తూ సమయం వృధా చేసుకుంటున్నారు. చేతిలో ఫోను లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేక వాటికి బానిసలై, ఆరోగ్యం కోల్పోతున్నారు. ఇప్పటికైనా మేల్కొని కేవలం అవసరానికి మాత్రమే స్మార్ట్‌ఫోన్ ఉపయోగిస్తూ తప్పటడుగులు వేయకుండా ముందుకుసాగాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

ఇటీవలి వర్షాలకు శ్రీకాకుళం జిల్లాలో పలు సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని చోట్లా రోగపీడితులు కనిపిస్తున్నారు. జలుబు, జ్వరం, ఒళ్లునొప్పులతో బాధపడుతున్నవారు దాదాపుగా ప్రతీ ఇంటిలో కనిపిస్తున్నారు.దీనికితోడు దేశవ్యాప్తంగా కరోనా కేసులు కూడా పెరుగుతుండడంతో రోగులకుకరోనా భయం కూడా తోడయింది. విషజ్వరాలు,మలేరియా, డయేరియా,డెంగ్యూ,ఫైలేరియా వంటి వ్యాధులబారిన వేలాది మందిపడి ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో సిబ్బందితో పాటు మందులకొరత కూడా వేధిస్తుండడంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులుతీస్తున్నారు.ముందస్తు ఆదేశాలు వచ్చినా ఆచరణలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ విఫలమైంది.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

పేదరిక నిర్మూలనకు చర్యలేవి?

పేదరికం కుటుంబ సమస్యలు, అధిక శిశుమరణాలు, పోషకాహార లోపం, బాలకార్మికులు, విద్యలేమి, బాల్యవివాహాలు మొదలైన వాటిపై ఎక్కువగా ప్రభావం చూపుతుంది. ఆర్థికవృద్ధిని వేగవంతం చేయ డం, వ్యవసాయ వృద్ధి,పేదరిక నిర్మూలన, మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధి, వంటి విభిన్న చర్యలద్వారా పేదరికాన్ని తొలగించాల్సిన అవసరం ఉంది. మానవ వనరుల అభివృద్ధిని వేగవంతం చేయడం, వ్యవసాయేతర ఉపాధి వృద్ధి, ఆస్తుల ప్రాప్తి, క్రెడిట్ యాక్సెస్,పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్, పేదరికంపై ప్రత్యక్ష దాడి, పేదలకు ప్రత్యేక ఉపాధి పథకాలు వంటివి అమలు జరపాలి. భారీ జనాభా, పరిమిత వనరులతో, ప్రభుత్వ యం త్రాంగానికి పేదరిక నిర్మూలనకు శిక్షణ లేకపోవడం మొదలైనవి పేదరిక నిర్మూలనకు ఆటంకంగా మారాయి.

డాక్టర్ పి.ఎస్.చారి

ప్రపంచంలోని ఏదేశానికైనా పేదరికం ప్రధాన సవాళ్లలో ఒకటి. పేదరికం అంటే ఆహారం, దుస్తులు, నివాసంతో సహా ప్రాథమిక అవసరాలను తీర్చడానికి తగినంత డబ్బు లేకపోవడం. పేదరికంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలు ఉండవచ్చు. ప్రపంచ బ్యాంకు ప్రకారం పేదరికం అంటే కొనుగోలు శక్తి సమానత్వం, నిబంధనలతో 1.9 అమెరికా డాలర్ లేదా అంతకంటే తక్కువతో జీవించడం. ప్రపంచ బ్యాంకు ప్రకారం ప్రపంచంలోని 9.2శాతం లేదా 689 మిలియన్ల మంది ప్రజలురోజుకు 1.90 డాలర్లకంటే తక్కువ ఆదాయంతో అత్యంత పేదరికంలో జీవిస్తున్నారు. కొవిడ్ మహమ్మారి, ఉక్రెయిన్, రష్యా యుద్ధం దీర్ఘకాలిక ప్రభావాల కారణంగా 2022లో 75 మిలియన్ల నుండి 95 మిలియన్ల మంది ప్రజలు అత్యంత పేదరికంలో జీవించే అవకాశం ఉంది. సంపూర్ణ పేదరికం అంటే ఆహారం, దుస్తులు, నివాసం వంటి ప్రాథమిక వ్యక్తిగత అవసరాలను తీర్చడానికి అవసరమైన సాధనాలు పూర్తిగా లేకపోవడం. సాపేక్ష పేదరికం అంటే ప్రాథమిక అవసరాలను తీర్చడానికిప్రజల వద్దతగినంత డబ్బు ఉన్నప్పటికీ ధనవంతులతో పోల్చినప్పుడు వారు పేదలు, అంటే ఇది ఆదాయ అసమానతలను సూచిస్తుంది.వాస్తవానికి, సామాజిక నిర్మాణం కారణంగా పేదరికం ఇతర సామాజిక దుఃఖాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ విధంగా సమాజం స్థూల స్థాయిలో పని చేస్తుంది. ప్రజలు, సమాజం, దేశం, ఆర్థిక వ్యవస్థ స్థిరమైన, సమ్మిళిత వృద్ధికి పేదరిక నిర్మూలన అవసరం. భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశం. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్నప్పటికీ, పేదరికం ఇప్పటికీ ప్రధాన సవాలుగా ఉంది. అయితే భారతదేశంలో పేదరికం తగ్గుముఖం పడుతోంది. 19వ శతాబ్దం చివరి నుండి 20వ శతాబ్దపు ఆరంభం వరకు బ్రిటిష్ రాజ్‌లో భారతదేశంలో పేదరికం తీవ్రరూపం దాల్చింది. 1920లలో గరిష్ట స్థాయికి చేరుకుంది. కరవులు వ్యాధులు 19,20 శతాబ్దాల ప్రారంభంలో అనేక విషచక్రాలలో మిలియన్ల మందిని చంపాయి. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, కరవుల వల్ల వచ్చే సామూహిక మరణాలు నిరోధించబడ్డాయి. 1956-57 మంచి పంట పండిన సంవత్సరం. సుప్రసిద్ధ ఆర్థికవేత్త బి.ఎస్ మిన్హాస్ భారతదేశ పేదరికం రేటు 65శాతంగా లెక్కించారు. 1960 నాటికి మిన్హాస్ పేదరికాన్ని 59శాతంగా అంచనా వేశారు. 1960వ దశకంలో భారతదేశంలో పేదరికం అంచనాలు విస్తృతంగా మారుతూ ఉన్నాయి. అప్పటి భారత ప్రభుత్వం తరపున దండేకర్, రాత్ 1960లలో పేదరికం రేటు సాధారణంగా 41 శాతం వద్ద స్థిరంగా ఉందని అంచనా వేశారు. 1970- 1980ల వరకు భారతదేశంలో పేదరికం మొండిగా ఉంది. ఇది 1970ల ప్రారంభంలో 1980ల వరకు జరిగిన ఎన్నికల సమయంలో రాజకీయ ప్రచారాల కోసం గరీబీ హటావో వంటి నినాదాలను సృష్టించింది. 1970లలో భారతదేశ అధికారిక దారిద్ర్యరేఖను ఉపయోగించి గ్రామీణ పేదరికం రేటు 50శాతం మించిపోయింది. 1991 నుండి వేగవంతమైన ఆర్థికవృద్ధి భారతదేశంలో తీవ్రమైన పేదరికాన్ని గణనీయంగా తగ్గించడానికి దారితీసింది. అయితే దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు దుర్బలమైన ఆర్థిక జీవితాన్ని గడుపుతున్నారు. సురేష్ టెండూల్కర్ కమిటీ నివేదిక ప్రకారం భారతదేశంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జనాభా 2009-2010లో 354 మిలియన్లు (జనాభాలో 29.6 శాతం) 2011-2012లో 69 మిలియన్లు (జనాభాలో 21.9శాతం) ఉన్నారు.

2009-10లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జనాభా 454 మిలియన్లు, 2011-2012లో 363 మిలియన్లు అని 2014లో రంగరాజన్ కమిటీ తెలిపింది. డ్యుయిష్ బ్యాంక్ రీసెర్చ్ అంచనా ప్రకారం మధ్యతరగతి ప్రజలు దాదాపు 300మిలియన్ల మంది ఉన్నారు.ఈ మునుపటి ధోరణులు కొనసాగితే, ప్రపంచ జిడిపిలో పేదరికంలో భారతదేశం వాటా 2016లో 7.3 శాతం నుండి 2020 నాటికి 8.5శాతానికి గణనీయంగా పెరుగుతుంది. 2012 లో దాదాపు 170 మిలియన్ల మంది లేదా భారతదేశ జనాభాలో 12.4 మంది పేదరికంలో ఉన్నారు.2010 నుండి 2015 వరకు సగటు వృద్ధి రేటు 1.3శాతంతో భారతదేశ జనాభా 1.28 బిలియన్లుగా ఉన్నట్లు ఆసియా అభివృద్ధి బ్యాంకు అంచనా వేసింది. 2014లో 15ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న జనాభాలో 9.9 శాతం మంది ఉపాధి పొందారు. డిసెంబర్ 2018 నాటికి జనాభాలో 6.9 శాతం ఇప్పటికీ జాతీయ దారిద్ర్యరేఖకు దిగువన 63 శాతం అత్యంత పేదరికంలో నివసిస్తున్నారు.2022 చివరి నాటికి 150-199 మిలియన్ల మంది అదనంగా పేదరికంలోకి జారుకుంటారని అంచనా వేయబడింది. మహమ్మారి కారణంగా పెద్దఎత్తున ఉద్యోగాల కోతలు జరిగాయి. భారతదేశంలో పేదరికం రేటు పెరగనుంది. సిఎమ్ఐఇ నివేదిక ప్రకారం ఒక సంవత్సరంలో దాదాపు ఏడు మిలియన్ల ఉద్యోగాలు కోల్పోయాయి. వినియోగ వ్యయం తగ్గింది. అభివృద్ధిపై ప్రజా వ్యయం మందగించింది. కాబట్టి రాబోయే రోజుల్లో భారతదేశంలో పేదరికం పెరుగుతుందని అంచనా. నీతి ఆయోగ్ ప్రకారం భారతదేశంలో 25 శాతం జనాభా పేదలు. భారతదేశంలోని మొత్తం జనాభాలో ప్రతి నాల్గోవ వ్యక్తి పేదరికంలో ఉన్నాడు. గ్లోబల్ మల్టీ పావర్టీ ఇండెక్స్ 2021 ర్యాంకింగ్‌లో భారతదేశం 109 ఇతర దేశాలలో 66వ స్థానంలో ఉంది. భారతదేశంలో అతి తక్కువ పేదరికం రేటు కేరళలో ఉంది. జనాభాలో కేవలం 0.71 శాతం మంది మాత్రమే పేదలుగా వర్గీకరించబడ్డారు. కేరళ తర్వాత గోవా, సిక్కిం, తమిళనాడు, పంజాబ్ వంటిరాష్ట్రాలు ఉన్నాయి.భారతదేశంలో అత్యంత పేద రాష్ట్రం బీహార్.నీతి ఆయోగ్ పేదరిక సూచిక నివేదిక ప్రకారం బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మేఘాలయ వంటి రాష్ట్రాలు భారతదేశంలో పేద రాష్ట్రాలుగా మారాయి. బీహార్‌లో 51.91 శాతం జనాభా పేదలుగా వర్గీకరించడింది. తర్వాత జార్ఖండ్, ఉత్తరప్రదేశ్,మధ్యప్రదేశ్, మేఘాలయ,అసొంలు ఉన్నాయి. ఇటీవలి అంచనా ప్రకారం దేశం 2030నాటికి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం ద్వారా తీవ్రమైన పేదరికాన్ని అంతం చేసే మార్గంలో ఉంది. భారతదేశంలో పేదరికానికి అనేక కారణాలు ఉన్నాయి. కరవులు, పోషకాహారలోపం, నిరక్షరాస్యత, జనాభా వేగంగా పెరగడం వల్ల నిరుద్యోగం, తక్కువ స్థాయి ఆర్థికాభివృద్ధి, వనరులు, భూమి అసమాన పంపిణీ, వివిధ సంక్షేమ విధానాల అక్రమ అమలు మొదలైనవి. పేదరికం కుటుంబ సమస్యలు, అధిక శిశుమరణాలు, పోషకాహార లోపం, బాలకార్మికులు, విద్యలేమి, బాల్యవివాహాలు మొదలైన వాటిపై ఎక్కువగా ప్రభావం చూపుతుంది. ఆర్థికవృద్ధిని వేగవంతం చేయడం, వ్యవసాయ వృద్ధి,పేదరిక నిర్మూలన, మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధి, వంటి విభిన్న చర్యలద్వారా పేదరికాన్ని తొలగించాల్సిన అవసరం ఉంది. మానవ వనరుల అభివృద్ధిని వేగవంతం చేయడం, వ్యవసాయేతర ఉపాధి వృద్ధి, ఆస్తుల ప్రాప్తి, క్రెడిట్ యాక్సెస్,పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్, పేదరికంపై ప్రత్యక్ష దాడి, పేదలకు ప్రత్యేక ఉపాధి పథకాలు వంటివి అమలు జరపాలి. భారీ జనాభా, పరిమిత వనరులతో, ప్రభుత్వ యం త్రాంగానికి పేదరిక నిర్మూలనకు శిక్షణ లేకపోవడం మొదలైనవి పేదరిక నిర్మూలనకు ఆటంకంగా మారాయి. ●

శాస్త్రీయ సంస్కృతిపై అవగాహన అవసరం

రావుశ్రీ

ప్రఖ్యాత అమెరికన్ కాస్మోలజిస్ట్ 'కార్లే ఎడ్వర్డ్ సేగన్ రచించిన, టి.విలో 1980లో ధారావాహికంగా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులచే విశేష ఆదరణ పొందిన 'కాస్మోస్' ప్రసారం అయిన సెప్టెంబర్ 28వ తేదీన పురస్కరించుకొని 2020 నుంచి 'అంతర్జాతీయ శాస్త్రీయ సంస్కృతి దినోత్సవం (ఐ.డి.యస్.సి)గా జరుపుకుంటున్నారు. ముఖ్యంగా ప్రజల్లో శాస్త్రీయ అవగాహన పెంచుటకు అన్వయించుకోవాలి అనే భావనతో ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ రోజు మాన వులు ఆస్వాదిస్తున్న ప్రతీ సౌకర్యాలు, పనిముట్లు, జీవిత అవ సరాలు, మందులు అన్నీ సైన్స్‌ప్రతిఫలాలే అని తెలుసుకోవాలి. మానవుడు భూమి మీద జీవనం ప్రారంభించిన నాటి నుంచి నేటివరకూ తన ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేసి,ఈ రోజు అంతరిక్షాన్ని కూడా తన గుప్పిట్లో పెట్టుకొనే స్థాయికి చేరుకున్నాడు అంటే శాస్త్రీయ ఆలోచన, దృక్పథం. తన జీవి తంలో సైన్స్ ఒకభాగం అని భావించాడు,ఆచరించాడు.అందు చేతనే ఈ భూమి మీద ఎన్ని అవాంతరాలు, అనారోగ్యాలు, విపత్తులు సంభవించినా, తన శాస్త్రీయ ఆలోచనలతో ఎదు ర్కొని నిలబడి, నవ నాగరికతకు చిరునామాగా తానై నిలిచాడు. తాజాగా ప్రపంచాన్ని భయభ్రాంతులకు గురి చేసిన కరోనా మహమ్మారికి అతి తక్కువ సమయంలో నియంత్రణ చేయ గలిగాడు అంటే అది సైన్స్ ఫలితమే.పౌర జీవనంలో శాస్త్రీయ సంస్కృతి మమేకం కావడం వల్లనే ఇటువంటి అద్భుతాలు సృష్టిస్తూ, ఈ విశాల ప్రపంచంలో నిటారుగా నిలబడగలుగుతు న్నాం. శతసంవత్సరాలు, ఆరోగ్యంగా బతకడానికి సైన్స్ ద్వారా శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఇక మనదేశానికి స్వాతంత్ర్యం సాధించే సమయంలోనే పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ వంటి నాయకులు దేశానికి, ప్రజలకు శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలని, తద్వారానే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చు అని తెలిపారు. ఆనాడు దేశంలో తిష్ట వేసిన మూఢనమ్మకాలు, సాంఘిక దురాచారాలు పేదరికానికి వీటన్నింటికి పరిష్కారం మాత్రం సైన్స్ అనే భావన కలిగించారు. అదే భావన ప్రతీ భారతీయ పౌరులలో భాగం కావాలని 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 51ఎ (హెచ్)లో పొందుపరిచారు. ప్రపంచంలో ఏ దేశ రాజ్యాంగంలో లేనివిధంగా మన భారతదేశంలో ప్రతీ పౌరుడు శాస్త్రీయ సంస్కృతి కలిగి ఉండాలని, తన అవసరాలను తీర్చుకునేందుకు సమస్య పరిష్కారానికి శాస్త్రీయంగా ఆలోచన చేసి అభివృద్ధి సాధించాలని దిశానిర్దేశనం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే ఆనాటి పాలకులు సైంటిఫిక్ విధానాల ద్వారా 'హరిత విప్లవం'

ద్వారా వ్యవసాయరంగంలో అధిక దిగుబడులు సాధించారు. శ్వేత విప్లవం ద్వారా పాడిపరిశ్రమ అభివృద్ధి, హైబ్రిడ్ విత్తనాల ద్వారా రకరకాల ఉత్పత్తులు సాధించారు. ఆనకట్టలు నిర్మించిన నీరు, విద్యుత్ అందించారు. పరిశ్రమలు స్థాపించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించుట జరిగింది. మరి నేడు మన పాలకులు ప్రాథమిక విద్య నుంచి యూనివర్సిటీ విద్య వరకూ మూఢనమ్మకాలు విశ్వాసాలు పెంపొందించే జ్యోతిష్యం, వాస్తు, మూఢ మత భావనలు పెంపొందించే సిలబస్ ప్రవేశపెడుతూ దేశాన్నితిరోగమనం వైపు నడిపిస్తున్నారు.మరి అదే సమయంలో భారత్ బయోటెక్ కంపెనీ శాస్త్రీయంగా అధ్యయనం చేసికరోనా వైరస్‌కు 'కోవేగ్జిన్' వ్యాక్సిన్ కనిపెట్టి కొన్ని లక్షల మంది ప్రాణాలు కాపాడింది. ఇదే సైన్స్ అందిస్తున్న విజయానికి ప్రత్యక్ష సాక్ష్యం. ఇతర దేశాలకు కూడా కోవేగ్జిన్ వ్యాక్సిన్ ఉచితంగానే మనం సరఫరా చేసి, ప్రపంచంలో మంచి పేరు తెచ్చుకొనుట